## ఫార్మాసిటీ మేడిపల్లిలోనే

> మొదటిపేజీ తరువాయి...

పథకాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వాటిపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, పిటిషనర్లు కూడా అదనపు అఫిడవిట్లు దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తమ భూమిపై నిషేధిత ఉత్తర్వులు తొలగించాలని, ధరణి పోర్టల్లో లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ పలువురు రైతులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ జరిపారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫార్మాసిటీ ఏర్పాటు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. మార్కెట్ ధరకు అనుగుణంగా భూములకు పరిహారం చెల్లింపుపై రైతులతో చర్చలు జరుగుతున్నట్టు చెప్పారు. రైతుబంధు కోసం రైతులు దరఖాస్తు చేస్తే పరిశీలించి చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది ప్రతివాదన చేస్తూ.. సింగిల్ జడ్జి తీర్పుతో భూసేకరణ రద్దయ్యిందని, కాబట్టి ధరణి పోర్టల్‌లో రైతులు లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. తద్వారా సింగిల్ జడ్జి తీర్పును ఆమోదించినట్టు అవుతుందని అన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, పిటిషనర్లు అదనపు అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించిన కోర్టు.. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# డామిట్.. కథ అడ్డం తిరిగింది!

> మొదటిపేజీ తరువాయి...

ఫార్మాసిటీపై ప్రభుత్వం దిగిరాగా.. ఫ్యూచర్ సిటీ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వాస్తవానికి భూసేకరణ చట్టం-2013 ప్రకారం.. ప్రభుత్వం సేకరించిన భూములను ఇతర అవసరాలకు వినియోగించే అవకాశం లేదు. ఒకవేళ అలా చేస్తే రైతులు తమ భూములను వెనక్కి తీసుకునే హక్కు ఉంటుంది. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు తెలియంది కాదు. అయినా ఇన్నాళ్లూ ఫ్యూచర్ సిటీ పేరుతో ఎందుకు డ్రామా ఆడినట్టు? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీకి అంకురార్పణ జరిగిన సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, యాచారం, కడ్తాల్ తదితర మండలాల పరిధిలో 19,333 ఎకరాల్లో దీన్ని ప్రతిపాదించగా 2018 సెప్టెంబర్‌లోనే దీనికి పర్యావరణ అనుమతులు లభించాయి. 13,000 ఎకరాల భూములు ఇదివరకే సేకరించగా, మొదటి దశలో దాదాపు 8,500 ఎకరాల్లో ఫార్మాసిటీని ప్రారంభించాలని గత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. భూసేకరణ చట్టం- 2013తోపాటు తెలంగాణ ప్రభుత్వం చట్ట సవరణ-2017 ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం భూసేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించి, పునరావాసానికి చర్యలు తీసుకోవాలి. ఏ ప్రాజెక్టు కోసం భూములు సేకరించారో, దానికే వినియోగించాలి. ఒకవేళ ప్రాజెక్టు అమలు కాకపోతే రైతులు తమ భూములను వాపస్ తీసుకునే అధికారం ఉంటుంది. అలాగే, పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం.. అనుమతులు తీసుకున్న ప్రాజెక్టును మాత్రమే అమలు చేయాల్సి ఉంటుంది. ఒకదాని కోసం పర్యావరణ అనుమతులు పొంది, మరో ప్రాజక్టు చేపట్టే అవకాశం లేదు.

### ఫ్యూచర్ సిటీ పేరిట డ్రామా..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఫార్మాసిటీని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు పలుమార్లు ఈ విషయాన్ని పేర్కొన్నారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములు, చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల్లో కలిపి 'ఫ్యూచర్ సిటీ' పేరుతో నాలుగో నగరాన్ని నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎనిమిది నెలలుగా ఊదరగొడుతున్నారు. రాష్ట్రంతోపాటు దేశ, విదేశాల్లో ఎక్కడ తిరిగినా ఇదే మాట చెప్తున్నారు. వాస్తవానికి ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఇతర పనులకు వినియోగించరాదు. కానీ ప్రభుత్వం ఇప్పటికే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసింది. గతంలో ఫార్మాసిటీ అవసరాలకు తగినట్టుగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని యూనివర్సిటీగా మార్చింది. నిబంధనల ప్రకారం ఫార్మా కోర్సులు మాత్రమే ఉండాలి. కానీ గుండుసూది నుంచి విమానం వరకు అన్నీ తయారు చేసేలా శిక్షణ ఇస్తామని ప్రభుత్వం ఊదరగొడుతున్నది. ఇదే ప్రాంతంలో 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి 60 ఎకరాల స్థలం కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. ఇటీవల రాష్ట్రానికి ఏ వ్యాపారవేత్త వచ్చినా ఫోర్త్ సిటీలో స్థలం కేటాయిస్తామని, పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు. మెట్రో రైలును సైతం ఫోర్త్‌సిటీ నుంచి వెళ్లేలా అలైన్‌మెంట్‌ను మార్చారు.

### ఫార్మా క్లస్టర్ల పేరుతో మరో డ్రామా..

ఫార్మాసిటీని రద్దు చేసిన ప్రభుత్వం 'సమీకృత గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల' పేరుతో కొత్త డ్రామాకు తెరలేపింది. ఓఆర్ఆర్ చుట్టూ ఆర్ఆర్ఆర్ మధ్య క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఒక్కో క్లస్టర్‌లో మూడు నుంచి నాలుగు ఫార్మా విలేజ్‌లు ఉండేలా ప్లాన్ చేసింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం నుంచే దీనికి అంకురార్పణ చేసింది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లిలో 1373 ఎకరాల్లో క్లస్టర్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించింది. ఈ మేరకు భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత రంగారెడ్డి, సంగారెడ్డి.. ఇలా వరుసగా ఒక్కో జిల్లాలో భూసేకరణ చేపట్టింది. మొత్తం 20 వేల ఎకరాలు సేకరించే ప్రయత్నం చేసింది



## రైతుల పోరాటంతో బెడిసికొట్టిన ప్లాన్

ఫ్యూచర్ సిటీ పేరుతో 25 వేల ఎకరాలు, ఫార్మా క్లస్టర్ల పేరుతో 20వేల ఎకరాల్లో 'ఫార్మా'య చేయాలనుకున్న ప్రభుత్వం ప్లాన్ రైతుల పోరాటంతో బెడిసికొట్టింది. ఫార్మాసిటీ కింద భూములు కోల్పోయిన రైతులు కోర్టును ఆశ్రయించారు. ఫార్మాసిటీని ఇతర అవసరాలకు వినియోగించే వెసులుబాటు భూసేకరణ చట్టంలో లేదని, కాబట్టి ఫార్మాసిటీనే ఏర్పాటు చేయాలని లేదా తమ భూములు వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఫార్మా క్లస్టర్ల బాధితులు సైతం ప్రభుత్వంపై తిరగబడ్డారు. తమ భూములను ఫార్మా కంపెనీలకు అప్పగించి గ్రామాల్లో విషం నింపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డిని సొంత నియోజకవర్గ ప్రజలే ఆగ్రహం వ్యక్తంచేశారు. న్యాయపోరాటం మొదలుపెట్టారు. ఇలా అటు ఫార్మాసిటీ, ఇటు ఫార్మా క్లస్టర్ల రైతుల పోరాటంతో ప్రభుత్వం వేసిన ప్లాన్ మొత్తం విఫలమై కథ అడ్డం తిరిగింది. ఫార్మాసిటీని కొనసాగించక తప్పని పరిస్తితి తలెత్తింది. ఫలితంగా.. ఫార్మాసిటీని కొనసాగిస్తామని ప్రభుత్వం హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేసింది. కేవలం తమ 'ఫ్యూచర్' కోసం చేపట్టిన నాలుగో సిటీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

## మంకుపట్టు పడితే పడావే..

గతంలో రాజశేఖర్‌రెడ్డి హయాంలో 'ఫ్యాబ్ సిటీ' పేరుతో ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో భూములు సేకరించింది. ఆశించిన పెట్టుబడులు రాకపోవడం, ఇతర అవసరాలకు వినియోగించే అవకాశం లేకపోవడంతో దశాబ్దాలపాటు భూములు పడావుగా ఉండిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం అనేక విజ్ఞప్తుల తర్వాత కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా ఆ భూమిని డీనోటిఫై చేస్తున్నది. ఫార్మాసిటీ భూముల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం మొండిపట్టుదలకు పోతే ఇదే జరుగుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

- ఫార్మాకు సాగు భూములను ఇవ్వం



దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా హకీంపేట చౌరస్తాలో రైతులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండాల పరిధిలో 1300 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఫార్మా కంపెనీ కోసం భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. -బొంరాస్‌పేట



శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో జస్టిస్ ఈశ్వరయ్య నివాసంలో సమావేశమైన బీసీ ప్రతినిధుల బృందం

## బీసీలకు వాటా దక్కేదాకా ఉద్యమించాలి

### జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : బీసీలకు న్యాయమైన వాటా దక్కేదాకా పోరాడాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య ఉద్బోధించారు. శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలోని బీసీ నాయకులు జస్టిస్ ఈశ్వరయ్య నివాసంలో సోమవారం సమావేశం అయ్యారు. బీసీలకు దక్కాల్సిన వాటా కోసం.. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్, బీసీ కులగణన వంటి అంశాల అమలుకు బీఆర్ఎస్ చేస్తున్న ఒత్తిడిలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ క్రమంలో బీసీ ప్రతినిధుల బృందం జస్టిస్ ఈశ్వరయ్యతో సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, సమగ్ర కులగణన సాధ్యమేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ సాధన కోసం బీసీలు అగ్రభాగాన నిలిచారని, అదే స్ఫూర్తితో బీసీల హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. 'మేమెంతో మాకంతా, మా వాటా మాకే' అనే నినాదాలతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మన హక్కుల కోసం పోరుబాటకు ఇదే సరైన సమయం అని సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నామని, ఇందులో భాగంగానే బీసీ మేధావి వర్గాన్ని కలుస్తున్నామని ప్రతినిధుల బృందం జస్టిస్ ఈశ్వరయ్యకు వివరించింది. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్సీలు రమణ, శంభీపూర్ రాజు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ ఉద్యమనాయకులు గంగాధర్‌గౌడ్, కర్నె ప్రభాకర్, భిక్షమయ్యగౌడ్, భగత్, రాకేశ్, ఆంజనేయులు, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్‌గౌడ్, సుధీర్‌కుమార్, ఉపేంద్రాచారి, కిశోర్‌గౌడ్, శుభప్రద పటేల్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, ఆలకుంట హరి, గడీల కుమార్‌గౌడ్, మన్నె రాజు పాల్గొన్నారు.

- భార్యపై ప్రేమతో విగ్రహం ఏర్పాటు

*ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఎడ్లబంజర గ్రామానికి చెందిన అశోక్ కన్న, పద్మశ్రీ 2006లో ప్రేమ పెండ్లి చేసుకున్నారు. వీరికి ఓ కూతురు ఉంది. అనారోగ్యంతో పద్మశ్రీ గత నెల 28న మృతిచెందింది. నెల మాసికం సందర్భంగా గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో భార్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించాడు. సోమవారం బంధువుల సమక్షంలో పూలమాలలు వేసి నివాళులర్పించిన అశోక్.. పద్మశ్రీపై ప్రేమను చాటుకున్నాడు. -పెనుబల్లి*



## విచారణ కమిటీపై 'స్త్రీనిధి' సమాఖ్య హర్షం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : స్త్రీనిధి సంస్థ, సంస్థ ఎండీ పై నలుగురు ఉన్నతాధికారులతో ప్రభుత్వం వేసిన విచారణ కమిటీని స్వాగతిస్తున్నట్టు స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇందిర, రాఘవదేవి, కోశాధికారి సరస్వతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్థపై అనవసరమైన అపోహలు కలిగించి సంస్థ పనితీరు, అభివృద్ధిపై ప్రభావం చూపేలా, సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కొందరు వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కమిటీ ద్వారా వాస్తవాలు తెలుస్తాయని, అపోహలు తొలిగిపోతాయని తెలిపారు. విచారణ కమిటీ ఏర్పాటుపై హర్షంవ్యక్తం చేశారు.

